## ప్రతిపక్షం లేకుండా చేయాలనేదే బీజేపీ కుట్ర

**వెల్దండ, మార్చి 28 ప్రభాతవార్త:** పార్లమెంట్‌లో ప్రతిపక్షం లేకుండా చేయడానికే బీజేపీ పార్టీ రాహుల్‌గాంధీ సభ్యత్వాన్ని రద్దు చేసిందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కాయితీ విజయ్‌కుమార్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు మోతిలాల్‌నాయక్‌లు అన్నారు. మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య పరిరక్షణ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాహుల్‌గాంధీ పాదయాత్రతో దేశ ప్రజలందరిని ఆకట్టుకున్నారని, దానిని జీర్ణించుకోలేకే బీజేపీ కాంగ్రెస్‌ను ఒంటరి చేయాలని చూస్తుందని మండిపడ్డారు. రాహుల్‌గాంధీ సభ్యత్వాన్ని రద్దు కాకుండా వ్యతిరేకిస్తూ 18 పార్టీలు తీర్మానం చేశాయని, ఏం చేసిన రాహుల్ గాంధీ భయపడరని, దేశ ప్రజలందరు త్యాగాల కుటుంబాలకు మద్దతుగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పర్వత్‌రెడ్డి, శేఖర్, వెంకటయ్యగౌడ్, చంద్రమోహన్‌రెడ్డి, హమీద్, తిరుపతిరెడ్డి, రమేష్, గోపాల్‌నాయక్‌తో పాటు తదితరులు ఉన్నారు.



## డాక్టరేట్ పొందిన జె.ఎల్ లక్ష్మికి కలెక్టర్ సన్మానం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 28 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల లెక్చరర్ తిప్పర్తి లక్ష్మిని డాక్టరేట్ పొందిన సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ సన్మానించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో మంగళవారం ఆమెకు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో జన్మించి లెక్చరర్ ఉద్యోగం పొందడం పట్టుదలకు నిదర్శనమన్నారు. ఇలా ఉద్యోగం చేస్తూనే ఉన్నతమైన ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పూర్తి చేయడం అభినందనీయమని కలెక్టర్ అన్నారు. జోగినీ వ్యవస్థ పరిణామాలను తన పరిశోధనగా అధ్యయనం చేయడం సామాజిక స్పృహను సూచిస్తుందని కలెక్టర్ అన్నారు. విద్యా ర్థులు కూడా పేదరికం, కష్టాలు మరిచి ఇష్టంతో చదివితే అనుకున్న లక్ష్యం సాధించగలుగుతారని కలెక్టర్ సూచించారు. తన విధి నిర్వహణలో కూడా విద్యార్థులను తన స్థాయికి తీసుకొచ్చేలా పనిచేయాలని ఆమెను కోరారు.



## విద్యుత్ కార్మికుడికి ఘన సన్మానం

**కల్వకుర్తి, మార్చి 28 ప్రభాతవార్త:** కల్వకుర్తి మండలం మార్చాల గ్రామంలోని విద్యుత్ కార్మికు డు మహిమూద్‌ను మంగళవారం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ అ ధ్యక్షులు ఎలుగొండ రాంరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు తలసాని లక్ష్మారెడ్డి శా లువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు ఎలుగొండ రాంరెడ్డి మాట్లాడుతూ శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ పున:ప్రతిష్ట మహోత్సవంలో భాగంగా నిర్వహించిన రథోత్సవ కార్యక్రమంలో గ్రామంలో ఎలాంటి విద్యుత్ ఇబ్బందులు లేకుండా చూసుకున్నారని తెలిపారు. రథోత్సవ కార్యక్రమానికి సహకరించినందుకు విద్యుత్ కార్మికుడిని సన్మానించినట్లు పేర్కొన్నారు.



## జీవిత భీమా పాలసీని సద్వినియోగం చేసుకోగలరు.

**కల్వకుర్తి, మార్చి 28 ప్రభాతవార్త:** పేద బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ జీవిత భీమా పాలసీని కల్వకుర్తి ప్రాంత ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని కౌన్సిలర్ నీరుకంటి మంజుల రాఘవేందర్‌గౌడ్ కోరారు. కల్వకుర్తి తపాల శాఖ కార్యాలయంలో బీజేపీ నాయకులు పట్టణ వాసులతో కలిసి భీమా పాలసీని అవగాహన కల్పించారు. జీవిత భీమా పాలసీ ఒక సంవత్సరానికి రూ.399లు చెల్లించి జీవిత భీమా పాలసీలో చేరాల్సిందిగా, ప్రమాదవశాత్తు జరిగిన కుటుంబానికి రూ.10లక్షల వరకు ఇన్సూరెన్స్ వర్తిస్తుందని, ఇలాంటీ స్కీంను కల్వకుర్తి నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



## బాధితులకు పెద్దదిక్కుగా నిలుస్తున్న ఐక్యత చైర్మన్

**వెల్దండ, మార్చి28ప్రభాతవార్త:** వెల్దండ మండల పరిధిలో బాధితులకు అన్ని విధాలుగా పెద్ద దిక్కుగా ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి నిలుస్తున్నారు. వెల్దండ మండలం రాచూర్ గ్రామానికి చెందిన రవికుమార్ అనారోగ్యంతో బాధపడుతుండటంతో మంగళవారం ఫౌండేషన్ చైర్మన్ సమకూర్చిన రూ.5వేలను ఎగ్జిక్యూటివ్ మెంబర్ వంప్రసాద్‌రెడ్డి అందించారు. అదే విధంగా వీరనాగమ్మ దేవాలయ నిర్మాణానికి ఆలయ నిర్వాహకులకు రూ.50వేలను అందించారు. ఈ సందర్భంగా వరప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ విద్య, వైద్యం, ఉపాధితో పాటు గ్రామాల్లో అంసపూర్తిగా నిలిచిపోయిన దేవాలయాలాభివృద్ధికి ఫౌండేషన్ చైర్మన్ కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు కొంగళ్ల రాఘవేందర్, మల్లేష్ ముదిరాజ్, దుబ్బ రాములు, లక్ష్మయ్య, ఎల్లయ్య, గిరిశంకర్, జయరాం, ప్రహ్లాద్, వంశీ, వెంకటేష్‌తో పాటు ఐక్యత ఫౌండేషన్ సభ్యులు తదితరులు ఉన్నారు.



## మిషన్ భగీరథ వాటర్ ట్యాంకులను శుభ్రపరచాలి..

**అధికారులకు ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నాయకులు..**

**అమరచింత, మార్చి 28 ప్రభాతవార్త:** మిషన్ భగీరథ వాటర్ ట్యాంకులను పరిశుభ్రంగా ఉంచకపోవడం వల్ల ఒండ్రునీరు వస్తుందని నీరు త్రాగడం వల్ల గిరిజనులకు రోగాలు వచ్చే అవకాశం ఉందని తక్షణమే అధికారులు చంద్రప్పతాండలో ఉన్న మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు శుభ్రం చేయాలని అమరచింత మండల కాంగ్రెస్ అధ్యక్షులు కె.జి.మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అరుణ్ కుమార్ ఒండ్రు మట్టి నీటిని బాటిల్‌లో పట్టి అధికారులకు చూపి ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం ద్వారా మంచి నీరు అందిస్తామని చెపుతున్న చంద్రప్ప తాండాలో గిరిజనులు ఒండ్రు నీరు త్రాగడం వల్ల అనారోగ్యాలకు గురవుతారని వారు అన్నారు. మండల ఎంపీఓ చంద్రప్ప తాండాలో ఉన్న వాటర్ ట్యాంక్ ను బుధవారం పరిశుభ్రంగా చేస్తామని కాంగ్రెస్ నాయకులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హనుమంతు నాయక్, నాగు నాయక్, లింగా నాయక్, తౌఫిక్, పోసిరిగారి విష్ణు, ఖాసీం, తదితరులు పాల్గొన్నారు.



## క్షయవాది అంతం మనందరి పంతం..

**మండల వైద్యాధికారి డా.వంశీకృష్ణ**

**వీపనగండ్ల, మార్చి 28 ప్రభాతవార్త:** మండల పరిధిలోని తూముకుంట గ్రామంలో క్షయ వాది అంతం మనందరి పంతం అనే కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైద్యులు ప్రజలతో ముఖాముఖ మాట్లాడి ప్రజలకు ఎలాంటి అనారోగ్యాలు ఉన్న ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను ఉపయోగించుకోవాలని ఈ సందర్భంగా వైద్యులు ప్రజలకు తెలిపారు. రెండు వారాలకు మించి దగ్గు ఉన్నచో వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి ఉచితంగా పరీక్షలు చేయించుకోవచ్చు అని వైద్యుల సలహా మేరకు మందులు వాడాలని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని కూడా కంటి పరీక్షలు చేయించుకొని ఉచితంగా అవసరం మేరకు కంటి అద్దాలను పొందవచ్చు అని వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక బృందంతో ప్రజలకు అవగాహన కలిగేలా సాంస్కృతి కార్యక్రమాలు వైద్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు.



# విద్యార్థులు పరీక్షలను ఆహ్లాదకరంగా తీసుకోవాలి..

**-నాగర్‌కర్నూల్ రీజియన్ చైర్మన్ అర్థం శ్రీనివాస్**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 28 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ మండల పరిధిలోని గుడిపల్లి గ్రామంలో వాసవీక్లబ్ రీజినల్ చైర్మన్ అఫిషీయల్ విసిట్ సందర్భంగా మంగళవారం గుడిపల్లి ఉన్నత పాఠశాలలో వాసవీక్లబ్ అధ్యక్షులు చిగుళ్లపల్లి జ్యోతి రమణకుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అర్థం శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలు రాసే సమయంలో ఎలాంటి ఒత్తిడిలకు గురి కాకుండా ఆహ్లాదకరమైన వాతావరణంలో పరీక్షలు రాయాలన్నారు. 10 సంవత్సరాలు ఎన్నో కష్టాలను భరించి మనల్ని చదివించిన మన తల్లిదండ్రులకు మనమిచ్చే గొప్ప కానుక మన విజయమేనన్నారు. 10వ తరగతి పరీక్షల్లో జిపిఎ 10 సాధించినప్పుడు ఆ తల్లిదండ్రుల ముఖంలో కనిపించే ఆనందానికి అవధులు లేవని, కాబటి విద్యార్థులందరు 10/10 జిపిఎ సాధించే విధంగా కృషి చేయాలన్నారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు పడుతున్న మా సంస్థ ద్వారా కార్యక్రమాలు నిర్వహిస్తూ వారికి సహాయ సహకారాలు అందిస్తామని జిల్లా అడిషనల్ ట్రెజరర్ గంధం ప్రసాద్ అన్నారు. ఈ యేడాది పాఠశాలలో 10/10 సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని చిగుళ్లపల్లి జ్యోతి రమణకుమార్ తెలిపారు. 10వ తరగతి చదువుతున్న 43 విద్యార్థులకు పరీక్షలకు సంబంధించి ప్యాడ్స్, పెన్నులను బహుకరించారు. కార్యక్రమంలో రీజినల్ సెక్రటరి ఒరుగంటి శ్రీనివాసులు, వాసవీక్లబ్ కార్యదర్శి కంచర్ల శ్యాంసుందర్, ట్రెజరర్ పోల రవికుమార్, గుడిపల్లి గ్రామ సర్పంచ్ అల్లమ్మ, విద్య కమిటీ చైర్మన్ చిన్నయ్య, గ్రామస్తులు నరసింహారెడ్డి, బిల్లకంటి రవికుమార్, ప్రధానోపాధ్యాయులు సాయిబాబు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.



విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు బహుకరిస్తున్న దృశ్యం

## పోలీసులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలి:జిల్లా ఎస్పీ

**నారాయణపేట ప్రతినిధి, మార్చి 28 ప్రభాతవార్త :** ఫిబ్రవరి నెలలో విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన పోలీస్ అధికారులకు, సిబ్బందికి జిల్లా ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఎస్పీ మొత్తం 19మందికి కెపిఐ రివార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నారాయణపేట జిల్లా పరిధిలో ఫంక్షన్ వర్టికల్ వారిగా విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ప్రతి ఒక్కరు ప్రజల రక్షణ కోసం అంకితభావంతో విధులు నిర్వహించి ప్రజలకు ఎల్ల వేళలా సేవలందించడానికి అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరు ఫంక్షనల్ వర్టికల్ వారిగా పోటీపడి విధులు నిర్వహించి రివార్డులు, అవార్డులు పొందాలని సూచించారు. కష్టపడి అంకితభావంతో విధులు నిర్వహించే వారికి డిపార్టుమెంట్‌లో ఖచ్చితంగా గుర్తింపు ఉంటుందని తెలిపారు. రివార్డ్సు అందుకోవడానికి అధికారులు పోటీపడి విధులు నిర్వహించాలని సూచించారు. ఏ అధికారి రికమండేషన్ లేకుండా ఆన్‌లైన్ డాటా నమోదు పరిచిన విధంగా సిసిటిఎన్ఎస్ అండ్ టిఎస్ కాప్ ఆధారంగా వారి జీవితాన్ని బట్టి పూర్తి పారదర్శకంగా రివార్డులు, అవార్డులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. పోలీసులు అహర్నిశలు శ్రమిస్తూ ప్రజలకు పూర్తి రక్షణ, భద్రత కల్పించుటకు వినూత్నమైన, సంస్థాగతమైన చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడానికి వర్టికల్స్ వారిగా విధులు విభజించడం వారి పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ప్రజలకు మరింత వేగవంతమైన, నాణ్యమైన సేవలందించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. అంతే కాకుండా వర్టికల్స్ టీమ్స్ పని తీరులో ప్రతిభ కనబర్చిన వారిని గుర్తించి వారిని ప్రోత్సహించుటకు ప్రోత్సాహకాలను అందించడం జరుగుతుందన్నారు. పోలీస్ అధికారులు సిబ్బంది మరింత బాధ్యతాయుతంగా ప్రజలకు సేవలు అందించాలని ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో డిసిఆర్‌బి డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు, మాగనూరు ఎస్సై నరేందర్, దామరగిద్ద ఎస్సై శ్రీనివాసరావు, జిల్లా వర్టికల్స్‌లో ప్రతిభ కనబర్చిన పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



కెపిఐ రివార్డులు అందజేస్తున్న ఎస్పీ

## గుండెపోటుపై అప్రమత్తంగా ఉండాలి:జడ్పీ చైర్‌పర్సన్

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, మార్చి 28 ప్రభాతవార్త :** ఆకస్మిక గుండెపోటు వల్ల వ్యక్తులు మరణించకుండా రాష్ట్ర ప్రభుత్వం కార్డియో పల్మొనరి రిససిటేషన్ (సిపిఆర్) పై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో మంచి కార్యక్రమం అని మహబూబ్‌నగర్ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి అన్నారు. జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మహబూబ్‌నగర్ సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయ సమావేశ మందిరంలో సిపిఆర్, ఏఈడిలపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కోవిడ్ సమయంలో సకాలంలో ఆసుపత్రులకు వెళ్లడం, పలు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల బ్రతుకుతామనే నమ్మకం మనుషుల్లో ఉండేదని, కాని కోవిడ్ తర్వాత వయసుతో నిమిత్తం లేకుండా ఆకస్మిక గుండెపోటు వల్ల అనేకమంది మరణిస్తున్నట్లు వస్తున్న వార్తలు బాధ కలిగిస్తున్నాయన్నారు. ఆకస్మిక గుండెపోటు వల్ల సంభవించే మరణాలను తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్డియో పల్మనరీ రీససిటేషన్‌పై వైద్య ఆరోగ్యశాఖతో పాటు సాధారణ ప్రజలందరికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని, శిక్షణ కార్యక్రమాలను ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకుని ఎక్కడైనా మన జీవితంలో ఎవరికైనా గుండెపోటు వచ్చినప్పుడు వారిని కాపాడేందుకు ప్రయత్నించాలని కోరారు. జిల్లా కలెక్టర్ జి.రవినాయక్ మాట్లాడుతూ కోవిడ్ తర్వాత మారిన పరిస్థితులు, జీవన విధానంలో మార్పు తదితర కారణాల వల్ల వయస్సుతో నిమిత్తం లేకుండా గుండెపోటు వస్తున్నదని అన్నారు. సిపిఆర్ శిక్షణ వల్ల కనీసం 50 శాతం గుండెపోటు మరణాలను తగ్గించవచ్చని ఆయన అన్నారు. శిక్షణ తీసుకున్న వారు వీలైనంత ఎక్కువ మందికి శిక్షణ ఇవ్వాలని, తద్వారా వారు కూడా ఎక్కువ మందికి శిక్షణ ఇస్తే రాష్ట్రంలో గుండెపోటు మరణాలు కొంచెమైనా తగ్గించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. మహబూబ్‌నగర్ మున్సిపల్ చైర్మన్ కెసి నర్సింహులు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. కృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో స్థానిక సంస్థలు, రెవెన్యూ అదనపు కలెక్టర్ సీతారామారావు, డిప్యూటి డిఎంహెచ్ఓ డా.భాస్కర్ నాయక్, డెమో తిరుపతిరావు, సిపిఆర్ మాస్టర్ ట్రైనర్లు నరేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, జిల్లా కలెక్టర్‌లు సిపిఆర్‌పై శిక్షణ పొందిన వారికి ధృవపత్రాలు అందజేశారు.

### టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ

## సీఎం కేసీఆర్ వెంటనే రాజీనామా చేయాలి..

**వనపర్తి టౌన్, మార్చి 28 ప్రభాతవార్త:** అచల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు వనపర్తి శాఖ ఆధ్వర్యంలో టిఎస్ పీఎస్సీ పేపర్ లీకేజీ కారకులపై చర్యలు తీసుకోవాలని వెంటనే ఈ విషయం పై సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి దోషులను శిక్షించాలని, ఈ లీకేజీ కి రాష్ట్ర ప్రభుత్వం నైతిక బాద్యత వహించాలని డిమాండ్ చేస్తూ వనపర్తి జిల్లా కేంద్రంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి క్యాంపు ఆఫీస్ ముట్టడి చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ జగదీశ్ మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ లో ప్రశ్నాపత్రాల లీకేజీ హైకోర్టు సిట్టింగ్ జడ్జి చే విచారణ జరపించాలని, ప్రశ్నాపత్రాల లీకేజీకి నైతిక బాద్యత వహిస్తూ సీఎం కేసీఆర్ వెంటనే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. టీఎస్‌పీఎస్సీ చైర్మెన్ ను వెంటనే తొలగించాలని, టీఎస్‌పీఎస్సీ ని మొత్తం ప్రక్షాళన చేయాలని, మొత్తం ఎన్ని పరీక్షల పేపర్లు లీకేజీ చేశారో ఆయా పరీక్షలను మొత్తం రద్దు చేసి మళ్లీ పరీక్షలను నిర్వహించాలని, ప్రశ్నాపత్రాల లీకేజీ చేసి అమ్ముకుంటున్న వారిని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గద్వాల జిల్లా కన్వీనర్ సురేష్, నగర కార్యదర్శి బాలకృష్ణ, గణేష్, వంశీ, సాగర్, మణి, తేజ, నిచల్, సురేష్, కేదరనాథ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసు ముట్టడికి బయలుదేరిన ఏబీవీపీ నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

### విద్యార్థులు స్వతహాగా కథల పుస్తకాలు చదవడం..

## వల్ల మానసిక అభివృద్ధికి ఉపయోగపడుతుంది..

**వనపర్తి టౌన్, మార్చి 28 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లాలో ఎంపిక చేసిన మొదటి దశలో బాగంగా 153 ప్రాథమిక పాఠశాలలో గ్రంథాలయ నిర్వహణకు, ప్రభుత్వం ప్రతి పాఠశాలకు 259 పుస్తకాలను అందజేయడం జరిగింది. ఈ పుస్తకాలను విద్యార్థుల స్థాయిలను బట్టి ఏ విధంగా ఉపయోగించాలి అనే విషయంపై శిక్షణ ఇవ్వడం జరిగింది. విద్యార్థులు కరోనా కాలంలో స్మార్ట్‌ఫోన్ లకు టీవీ లకు ఎక్కువ సమయం కేటాయిస్తున్నందు వల్ల చదువుకు సంబంధించినటువంటి రీడింగ్ స్కిల్ నిర్లక్ష్యానికి గురవుతున్నారని అన్నారు. కావున ప్రభుత్వం విద్యార్థులకు ఆకర్షనీయంగా చిత్రాలతో కూడిన కథల పుస్తకాలను ఎంపిక చేసిన పాఠశాలకు మొదటి దశగా 259 పుస్తకాలను అందజేయడం జరిగింది. విద్యార్థులు స్వతహాగా కథల పుస్తకాలు చదవడానికి ప్రయత్నం చేయడం వల్ల ఎంతో మానసిక అభివృద్ధి భాషాభివృద్ధి సమాచార అభివృద్ది జరిగి విద్యార్థి ఉన్నతికి ఉపయోగపడుతుంది కావున గ్రంథాలయ నిర్వహణ కార్యక్రమాన్ని ప్రతి పాఠశాలలో విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈఓ శ్రీనివాస్ గౌడ్, ఏఎంఓ మహానంది, ఆర్పీలు నాగరాజు, కిరణ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. 2రోజుల పాటు 14మండలాల నుండి ఎంపిక చేసిన ఉపాధ్యాయులకు గాయిత్రి బీఈడీ కాలేజీలో శిక్షణ ఇవ్వడం జరిగింది.



ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

### అయిస్టార్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో

## 10వ తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ బుక్స్ పంపిణీ..

**పెద్దమందడి, మార్చి 28 ప్రభాతవార్త:** పెద్దమందడి ప్రభుత్వ హైస్కూల్‌లో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ శిక్షణ కార్యక్రమ సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ సాగర్ ఆధ్వర్యంలో నిర్వహించగా ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి విద్యార్థులు 10వ తరగతి పూర్తి అయిన తరువాత జీవితంలో మంచి ఉద్యోగాలు సాధించడం కోసం లక్ష్య సాధనకు నిరంతర కృషి పట్టుదల, శ్రద్ధ, ఏకాగ్రత, ప్రణాళిక, ఆత్మక విశ్వాసం పరిశీలనాత్మక దృష్టి ఖచ్చితంగా ఉండాలని విద్యార్థుల జీవితానికి 10వ తరగతి తొలిమెట్టు వంటిదని, పై చదువులకు, ఉద్యోగాలకు ఈ మార్కులను కొలమానంగా తీసుకుంటారు కాబట్టి ఉన్నత చదువుల కోసం ప్రణాళికతో ముందుకు సాగాలని అందుకు ప్రతి ఒక్కరుపై చదువులకు అవసరమైన అనేక విషయాలు ముఖ్యంగా ప్రవేశ పరీక్ష తేదీన విధానాలు పై చదువులకు సంబంధించిన అవకాశాలు తెలుసుకోవాలనే అదే విధంగా ప్రతి విద్యారింథ సాంస్కృతిక, సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొని భావి భారత పౌరులుగా మెలగాలని పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి, పాఠశాల ఉపాధ్యాయులు శాంతన్న, గిరిరాజ, రాజానగరం రాజేష్, కొమ్ము చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.



*10వ తరగతి విద్యార్థులకు కెరీర్ గైడ్స్ పంపిణీ చేస్తున్న దృశ్యం*

### రెండవ రోజు కోదండ

## రామాలయంలో బ్రహ్మోత్సవాల ప్రత్యేక పూజలు

**ఇటిక్యాల, మార్చి 28 ప్రభాతవార్త :** మండల పరిధిలోని బీచుపల్లి పుణ్యక్షేత్రంలో గల కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం రెండవ రోజు వివిధ ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుప్రభాత సేవ, తిరుణరాధన, గరుడపట ఉత్సవం, ధ్వజారోహణం, అష్టదిగ్బంధనం, మూలమంత్ర హోమాలు నిర్వహించారు. అలాగే సాయంత్రం దేవతా ఆహ్వానం, యాగశాల ఆరాధను, మూలమంత్ర హోమాలు అంతేకాక శ్రీ లక్ష్మి హయగ్రీవ హోమం నిర్వహించినట్లు పూజ కార్యక్రమంలో అర్చకులు సుదర్శన్ నారాయణస్వామి శిష్యబృందం, కోదండరామస్వామి ఆలయ అర్చక బృందం ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవపూజ కార్యక్రమాలు నిర్వహించినట్లు, 30వ తేదీ గురువారం సీతారాముల కళ్యాణోత్సవ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు జిల్లాలోని చుట్టుపక్కల గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కళ్యాణత్సవ కార్యక్రమం విజయవంతం చేయాలని ఆలయన మేనేజర్ సురేంద్రరాజు తెలిపారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ...

**వెల్దండ, మార్చి 28 ప్రభాతవార్త:** వెల్దండ మండలం లింగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కొమ్ము కృష్ణయ్య ఇటీవల గుండె పోటుతో మృతి చెందాడు. మంగళవారం మండల మాదిగల ఐక్యవేదిక అధ్యక్షులు మీసాల అంజయ్య పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చి మాదిగల ఐక్య వేదిక తరుపున రూ.10.500ల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో సోమయ్య, జంగయ్య, శేఖర్, పుల్లయ్య, వెంకటయ్య, దేవయ్య, లక్ష్మయ్య, దేవదాసుతో పాటు ఉన్నారు.



## మత్స్యకారుల హర్షం..

**వెల్దండ, మార్చి 28 ప్రభాతవార్త:** మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేయడంతో తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ముదిరాజ్‌ను ముదిరాజ్ మహాసభ రాష్ట్ర నాయకులు నూకం వెంకటయ్య ముదిరాజ్ ఆధ్వర్యంలో మంగళవారం శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందించారు. 33 జిలాల మత్స్య సహకార సంఘాల ఎన్నికలను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు.



## సీసీ రోడ్డు పనులు ప్రారంభం

**వెల్దండ, మార్చి 28 ప్రభాతవార్త:** అల్లంతోటబావి పరిధిలోని కళ్యాణవాగుతాండలో రూ.10లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను గ్రామ సర్పంచ్ ఇస్లావత్‌కుమార్, ఎంపీటీసీ చిట్టి కాదూరాంలు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ తండాలాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారని, తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయడంతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ రవినాయక్, ఉప సర్పంచ్ ఇస్లావత్ శ్రీను, గ్రామ కార్యదర్శి నందకిశోర్, మాజీ ఎంపీటీసీ హన్మంతు, నాయకులు శంకర్‌నాయక్, హన్మంతునాయక్, సుధీర్‌నాయక్, నర్సింగ్‌నాయక్‌తో పాటుతదితరులు ఉన్నారు.



## వచ్చే ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడిద్దాం..

**వీపనగండ్ల, మార్చి 28 ప్రభాతవార్త:** సీపీఎం పార్టీ జన చైతన్య యాత్ర పెబ్బేరు నుండి వనపర్తి జిల్లా కేంద్రంలోకి వచ్చే సమయంలో వారికి స్వాగతం పలకడానికి వీపనగండ్ల మండల కేంద్రం నుండి సీపీఎం కార్యకర్తలు రెడ్ టీ షర్ట్ వాలంటరీస్ మండల కేంద్రం నుండి బయలు దేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మతోన్మాద బీజేపీ ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రైవేటుపరం చేసి ప్రధాని అధానీ, అంబానీ లకు కట్టబెడుతున్నారని కేంద్ర ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. కోటి ఉద్యోగాలు కల్పిస్తాను అని చెప్పిన కేంద్ర బీజేపీ ప్రభుత్వం అన్ని ప్రభుత్వ సంస్థలన్నీ ప్రైవేటుపరం చేసి ఉద్యోగాలు ఊడిపోయేలా చూస్తున్నారని వచ్చే ఎన్నికల్లో బీజేపీ తగిన బుద్ది చెప్పాలన్నారు. మండల కార్యవర్గసభ్యులు మురళి, మండల నాయకులు ఆశన్న, ఈశ్వర్, వెంకటయ్య, వెంకటేష్ గౌడ్, నాగరాజు, రామకృష్ణ, నవీన్, బత్తుల రాముడు, రామన్ గౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు.



## డీటీసీలో అవుట్‌డోర్ క్రైం సీన్ అబ్జర్వేషన్

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, మార్చి 28, ప్రభాతవార్త:** జడ్చర్ల మండల కేంద్రంలోని జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రంలో హెడ్ కానిస్టేబుల్, ఏఎస్సై నుంచి ఎస్సైగా పదోన్నతి పొందిన చార్మిన్, యాదాద్రి జోన్‌కు సంబంధించి ఏడుగురికి అవుట్‌డోర్ క్రైం సీన్ అబ్జర్వేషన్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ మేరకు జోగుళాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహా న్ ఆధ్వర్యంలో శిక్షణ కొనసాగింది. ఈ సందర్భంగా వివిధ అంశా లపై శిక్షణ ఇచ్చి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో నల్లగొండ ఎస్పీ అపూర్వారావు, మహబూబ్‌నగర్ ఎస్పీ నరసింహ, 12వ బెటాలియన్ సాంబయ్య, అదను ఎస్పీ రాములు పాల్గొన్నారు.



## రెండో అపర భద్రాదిగా..

# శిర్సనగండ్ల శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం

**◆ ఈ నెల 30న రాములోరి కల్యాణోత్సవానికి ఏర్పాట్లు పూర్తి ◆ వేలాదిగా తరలిరానున్న భక్తులు ◆ నేడే మాస కల్యాణం**



శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం

**వంగూరు,మార్చి28, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో రెండో అపరభద్రాదిగా చారకొండ మండలం శిర్సనగండ్ల శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి ప్రఖ్యాత ఉంది. హిందువులు జరుపుకునే పండుగలలో శ్రీరామనవమి పండుగ ఎంతో విశిష్టమైనది. శ్రీరామనవమి అంటే శ్రీరాముడి జన్మదినం, శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం ఒకే రోజు కావడంతో ఈ పండుగను వాడ వాడన ఎంతో ఘనంగా జరుపుకుంటారు. అదే సందర్భంలో అపర భద్రాదిగా పేరొందిన శిర్సనగండ్ల గుట్టపై శ్రీ సీతారాముల కళ్యాణం లక్షలాది భక్తుల మధ్య వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఘనంగా నిర్వహిస్తారు. చైత్రశుద్ధ అష్టమి నుంచి చతర్థశి వరకు జరిగే ఉత్సవాల్లో లక్షలాది మంది భక్తులు పాల్గొంటారు.చారకొండ మండల కేంద్రం నుంచి శిర్సనగండ్ల శ్రీసీతారామచంద్రస్వామిదేవాలయం 7కిలో మీటర్ల దూరంలో ఉంటుంది. బుధవారం నుంచి వారం రోజుల పాటు అంగరంగా వైభవంగా కన్నుల పండువగా బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. పూర్వపు మహబూబ్‌నగర్ జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రం శిర్సనగండ్ల గుట్ట. 60 ఎకరాల్లో విశాలమైన భూమిలో ఆలయం విస్తరించి ఉంది. జిల్లా నలుమూలల నుంచే కాకుండా నల్గొండ, హైదరాబాద్, రంగారెడ్డిలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి లక్షలాది భక్తులు పాల్గొని స్వామి వారి కళ్యాణోత్సవాన్ని తిలకించి మొక్కులు తీర్చుకుంటారు. శ్రీరామనవమి రోజు భద్రాచలంలో జరిగే కళ్యాణం ముహుర్తానికి శిర్సనగండ్ల గుట్టపై ప్రభుత్వ లాంఛనలతో శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం అంగరంగా వైభవంగా నిర్వహిస్తారు.

**ఆలయ చరిత్ర:** క్రీ.శ. 13వ శతాబ్ధంలో ఆలయ నిర్మాణం చేపట్టినట్లు శిలా శాసనాలు తెలుపుతున్నాయి. దట్టమైన అరణ్యంలో గుట్టపై దత్తాత్రేయ ఆశ్రమం, ముత్యాలమ్మ ఆలయం ఉండేది. శిర్సనగండ్ల గ్రామానికి చెందిన దేరం రామయాజ్జీ అనే ఉపాధ్యాయుడికి కలలో దర్శనమిచ్చిన రాముల వారు భద్రాచలంలోని పాల్వంచ సమీపంలోని రావిచేడు గ్రామంలో భాస్కరుడు అనే పురోహితుడు ఇంటి పెరటి భాగంలో కాకర పాదు క్రింద సీతారామ చంద్రస్వామి విగ్రహాలను దాచినట్లు చరిత్ర ద్వారా తెలుస్తోంది. ఆ విగ్రహాలను భద్రాచలంలో ప్రతిష్టించాల్సి ఉన్నప్పటికి సకాలంలో అక్కడికి చేరుకోక పోవడంతో వేరే విగ్రహాలను ప్రతిష్టించారు. కోడి కూత, రోకటి మోత వినిపించని ప్రశాంతమైన శిర్సనగండ్ల గుట్టపై ఆలయాన్ని నిర్మించి విగ్రహాలను ప్రతిష్టించమని ఆజ్ఞాపించారు. శ్రీరాముడి స్వప్న సందేశం మేరకు పాల్వంచ సమీపంలోని రావిచేడు గ్రామంలో భూస్థాపితంగా ఉన్న రామలక్ష్మణ సీత సమేతుడైన విగ్రహాలతో హన్మంతుడి విగ్రహాన్ని బయటకు తీసి శిర్సనగండ్ల గుట్టపై ప్రతిష్టించారు. ఆ తర్వాత శాతావాహనులు 1591లో ముఖ మండప నిర్మాణం చేసినట్లుశిలాశాసనంలో తెలుపబడింది.దత్తాత్రేయ ముని స్వయంగా శాస్త్రోత్తకంగా సీతారామలక్ష్మణ హనుమాన్ విగ్రహాలను ప్రతిష్టించారని పూర్వీకులు చెబుతున్నారు.

**ఉత్సవాల వివరాలు:** ఈ నెల 29న బుధవారం స్వామి వారి మాస కళ్యాణం, ధ్వజాపథకం, అరోహణ, అభిషేకం, అలంకరణ, మహానివేధన,



ఆలయ ముఖ ద్వారం



పెద్ద రథోత్సవం



ఆలయ గోపురం

మహానిరాజనం, తీర్థ ప్రసాద వితరణ, ఎదుర్కొళ్లు, పల్లకిసేవ నిర్వహించబడును. ఈ నెల 30న గురువారం మధ్యాహ్నం 12గంటలకు దివ్యమైన ముహుర్తంలో శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం జరుపగా గరుఢసేవ, రాత్రికి చిన్న రథం(పూల తేరు),31న శుక్రవారం వేదపారాయణం, కుంకు మార్చన, ఏప్రిల్ 1న శనివారం శివదత్తాత్రయ, పరుశరామ అమ్మవారి ఆలయంలో ప్రత్యేకఅర్చనాదాలు,రాత్రికి ప్రదోషరాజోపచారములు,పెద్ధ రథం(బ్రహ్మోత్సవం), 02న ఆదివారం ఉదయం అభిషేకం, అర్చనలు, నాగబలి పూర్ణాహుతి (దోపోత్సవం), 03న సోమవారం పల్లకిసేవ, అభిషేకం, చక్రతీర్థం, ద్వాదశారధన, రాత్రి స్వామి వారికి ఏకాంత సేవ, 04న మంగళవారం శివదతాత్రేయ,పరుశరామ, పోచమ్మ అమ్మవారి దేవాలయాల్లో అర్చనాదాలు, సంకీర్తనలు నిర్వహించనున్నట్లు దేవాలయ చైర్మన్ శ్రీనివాసశర్మ తెలిపారు.

**ప్రత్యేక బస్సులు:** శిర్సనగండ్ల శ్రీసీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా కల్వకుర్తి, దేవరకొండ, అచ్చంపేట డిపోల నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆలయ చైర్మన్ దేరం మల్లిఖార్జున శర్మ తెలిపారు. అదే విధంగా ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రత్యేక ఏర్పాట్లను చేసి తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. బ్రహ్మోత్సవాలకు మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాతో పాటు ఆయా ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. కల్వకుర్తి డీఎస్పీ గిరిబాబు ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో శాంతి భద్రతాలకు విఘాతం కలుగకుండా గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు.

## జిల్లా స్థాయి చిత్రలేఖనంలో వనపర్తి వాసి..




చిత్రలేఖనంలో రెండవ బహుమతి అందుకుంటున్న వనపర్తి వాసి కావేరి

**వనపర్తి టౌన్,మార్చి 28 ప్రభాతవార్త:** నెహ్రూ యువ కేంద్రం పాలమూరు ఆధ్వర్యంలో యువ ఉత్సవ్ సందర్భంగా పాలమూరు విశ్వ విద్యాలయంలో నిర్వహించిన ఉమ్మడి పాలమూరు జిల్లా స్థాయి చిత్రలేఖనంలో వనపర్తి జిల్లా విద్యార్థిని కావేరి కి 2వ స్థానం లభించింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎన్‌వైకెస్ స్టేట్ డైరెక్టర్ విజయరావు, పాలమూరు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ లక్ష్మీకాంత్ రాథోడ్, ఎన్‌వైకెఎస్ పాలమూరు జిల్లా కోఆర్డినేటర్ కోట నాయక్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువులోనే కాదు విద్యార్థులు ఆటలు వివిధ రకాల కళా నైపుణ్యాల్లో కూడా రాణించాలని అన్నారు. భారతదేశం వివిధ రకాల దేశాలతో పోటీ పడి అభివృద్ధి చెందుతుంది అంటే దానికి కారణం కృషి, పట్టుదల ఉంటే గ్రామ స్థాయి నుండే ప్రతి ఒక్కరు అనేక రంగాల్లో రాణించి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించి వారి నైపుణ్యాన్ని చాటు కోవాలని అన్నారు. ఇందుకు ముఖ్యంగా తల్లిదండ్రుల ప్రోత్సాహం తప్పక ఉండాలని తెలిపారు. ఈ సందర్భంగా కళాకారులు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. తదనంతరం బహుమతులప్రధాన కార్యక్రమంలో వనపర్తి వాసి నానమోని మణ్యం కూతురు కావేరికి చిత్రలేఖనంలో 2వ స్థానంలో షీల్డ్, ప్రశంసపత్రం, రూ.1500 అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాలమూరు విశ్వవిద్యాలయం రిజిస్టర్ గిరిజ మంగతాయారు, హిందూవాహిని విభాగ్ కన్వీనర్ అభిలాష్ హూదేకర్, ఎన్‌వైకెస్ వాలంటీర్ తిరుమలేశ్, రాజేందర్ గౌడ్, రిషి స్కూల్ యాజమాన్యం, నవోదయ నర్సింగ్ హోం యాజమాన్యం పాల్గొన్నారు.

## కార్పొరేషన్ లోన్ కొరకు దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూ..

**పెబ్బేరు,మార్చి 28 ప్రభాతవార్త:** 2022-23 సంవత్సరానికి సంభందించిన మైనార్టీ కార్పొరేషన్ లోన్ లకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మంగళవారం పురపాలక సంఘం కార్యాలయంలో ఇంటర్వ్యూ నిర్వహించారు. మున్సిపల్ కు సంబందించిన ఆరు యునిట్లు మాత్రమే మంజూరు కాగా 53మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఎస్బీఐ, ఏపీజీవీబీ, యూనియన్ బ్యాంక్‌లకు సంబందించిన మేనేజర్లు దరఖాస్తులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ ఆదిశేషు, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎద్దుల కరుణ శ్రీసాయినాథ్, మేనేజర్ గణేష్ బాబు, మహిళ సంఘం టీఎంసీ రాధ తదితరులు పాల్గొన్నారు

## ప్రణాళికతో చదివితే 10/10 కష్టమేమీ కాదు

**తెల్కపల్లి,మార్చి 28 ప్రభాతవార్త:** ప్రణాళికతో చదివితే పదవ తరగతి పరీక్షలు 10/10 కష్టమేమి కాదని ప్రముఖ సైకాలజిస్టు శ్యాంప్రసాద్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సిద్ధార్థ మోడల్ హైస్కూల్లో జరిగిన పదవ తరగతి విద్యార్థులు వీడ్కోలు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుపట్ల శ్రద్ధ ఎంతో అవసరమని, చదవాలని, టెన్షన్ కూడా ఉండాలని టెన్షన్ లేకపోతే విద్యార్థులలో నిర్లక్ష్యం ఆవహిస్తుందని ఆయన అన్నారు. నిరంతరం చదవడం కంటే మధ్యలో విరామం ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విద్యార్థులు సమయానికి తినాలని తద్వారా ఆరోగ్యంగా ఉంటారని ఆయన అన్నారు.అనేక ఉదాహరణలతో ఎలా చదవాలో ఆయన పదవ తరగతి విద్యార్థులకు సూచించారు.ఇదే క్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలస్వామి, మండల పిఆర్‌టియు అధ్యక్షులు భోగరాజు చంద్రశేఖర్ మాట్లాడుతూ చదువు పట్ల నిర్లక్ష్యం తగదని ప్రణాళికతో చదివితే ఉత్తమమైన మార్పులు సాధించవచ్చని వారన్నారు. కార్యక్రమంలోపాఠశాల ప్రధానోపాధ్యాయులుఎం.శ్రీనివాస్‌గౌడ్,పాఠశాలకర స్పాండెంట్‌ఎం.విజయగౌడ్,ఉపాధ్యాయులువెంకటయ్య,మల్లేష్,రాము, సతీష్, ఆంజనేయులు,ఉపాధ్యాయబృందం, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్‌బిఐ బ్యాంకు ఖాతాదారులు ఇన్సూరెన్స్ సద్వినియోగం చేసుకోవాలి

**మక్తల్ రూరల్,మార్చి 28 ప్రభాతవార్త:** బ్యాంకు ఖాతదారులు ఇన్సూరెన్స్‌లను సద్వినియోగం చేసుకోవాలని జక్లేర్ ఎస్‌బిఐ బ్రాంచ్ మేనేజర్ వినోద్‌కుమార్ అన్నారు. మంగళవారం జక్లేర్ ఎస్‌బిఐ వద్ద బాధిత మహిళ రామమ్మకు రూ. 12 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామమ్మ భర్త సోమప్ప జక్లేర్ బ్రాంచిలో రూ. 12,రూ. 330, రూ. 500ల భీమా చేశారని తెలిపారు. గత ఏడాది ఆగస్టు 2వతేదీన కల్వకుర్తి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ మేరకు కురువ రామమ్మ రూ.12 లక్షల చెక్కునుఅందించారు. కార్యక్రమంలో జక్లేర్ ఉపసర్పంచ్ సంగీత నర్సింలు, బ్యాంకు సిబ్బంది సురేష్, ఇమ్రాన్, జీవన్, మధు, పూజారి కురుమయ్య,పులిమామిడి రమేష్, పోలప్ప, రమేష్ పాల్గొన్నారు.

## సీతారాముల కల్యాణం చూతమురారండి..!

- ■ జిల్లాలో శ్రీరామనవమి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి
- ■ రామాలయాలు,ఆంజనేయస్వామి దేవాలయాలు ముస్తాబు
- ■ 29 నుండి చిన్నరాజమూర్‌లో వేడుకలు శ్రీకారం
- ■ 30న మన్యంకొండలో సీతారాముల కల్యాణమహోత్సవం



చిన్నరాజమూర్ ఆంజనేయస్వామి దేవస్థానం

**దేవరకద్ర,మార్చి28 ప్రభాతవార్త:** జిల్లాలోని రామాలయా లు, ఆంజనేయస్వామి దేవాలయాలు శ్రీరామనవమి వేడుకలకు ముస్తాబయ్యాయి. సీతారామచంద్రస్వామి కల్యాణ ముహూర్తానికి వేళ అయింది. జిల్లాలోని ప్రధాన దేవాలయాలతో ఈ పవిత్ర కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రతి ఏడాది జిల్లాలోని రామాలయాలు,ఆంజనేయస్వామి దేవాలయాలలో శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణ మహోత్సవాలను అత్యంథ ఘనంగా నిర్వహిస్తారు.ఈ నెల 30న ఈ వేడుకలు జిల్లా వ్యాప్తంగా జరుగనున్నాయి.అందులో భాగంగానే ఈ ఏడాది కూడ శ్రీరామనవమి వేడుకలకు ఆయా గ్రామాలలో నిర్వహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.ఈ సందర్భంగా ఆయా గ్రామాలలోని రామాలయాలు,ఆంజనేయస్వామి దేవాలయాలలో శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకొని సీతారాముల కల్యాణమహోత్సవాలను నిర్వహిస్తారు. ఎంతో భక్తిశ్రద్దలతో ఈ పవిత్రఘట్టాన్ని కన్నులపండువలా నిర్వహిస్తారు. ఈ క్రతువును కనులారా తిలకించడానికి ఆయా గ్రామాలలో భక్తులు దేవాలయాలకు అధికసంఖ్యలో తరలివస్తారు.అలాగే స్వామి వారి పట్టా భిషేకం కార్యక్రమాలను కూడ నిర్వహిస్తారు.

**30న మన్యంకొండలో:** మన్యంకొండలో ఈ నెల 30న శ్రీరామనవమి వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.ఈ సందర్భంగా ఈ రోజు వెంకటేశ్వరస్వామి కళ్యాణమహోత్సవాన్ని నిర్వహిస్తారు. శ్రీరామనవమి సందర్బంగా దేవస్థానంలో స్వామి వారి కళ్యాణమహోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయతీగా వస్తుంది. అలాగే ఈ నెల 31న స్వామి వారి పట్టిభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.దీనికి గాను మన్యంకొండలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

**29 నుండి చిన్నరాజమూర్‌లో వేడుకలు శ్రీకారం:** దేవరకద్ర మండలం చిన్నరాజమూర్ శ్రీఆంజనేయస్వామి దేవస్థానంలో శ్రీరామనవమి వేడుకలను ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ప్రతి ఏడాది ఆ వేడుకలను అత్యంథ ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ నెల 29న ఈ వేడుకలను నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా వేడుకల మొదటి రోజు స్వామి వారి సన్నిధిలో ధ్వజారోహణం పూజా కార్యక్రమంతో వేడుకలకు శ్రీకారం చుడతారు. అలాగే అదే రోజు స్వస్థిపుణ్యాహవచనం,పూజ,ఎదుర్కోళ్ళు తదితరపూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. అలాగే ఈ నెల 30న శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తారు. అలాగే సుప్రభాతం,స్వామివారిఅలంకరణ,పునర్వసు నక్షత్రం సందర్భంగా తలంబ్రాలు,సీతారామస్వామి రథోత్సవం,ప్రత్యేక భజనలు,తీర్థప్రసాద వితరణ తదతర పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారు.అలాగే స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు,అర్చనలు నిర్వహిస్తారు. ఈ వేడుకలకు జిల్లా నలుమూలల నుండి దేవస్థానానికి భక్తులు అధికసంఖ్యలో తరలివస్తారు.

**దేవరకద్రలో:** దేవరకద్రలో శ్రీరామనవమి వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా దేవరకద్రలోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో శ్రీరామనవమి వేడుకల సందర్భంగా దేవస్థానం ఆవరణలో వేసిన పచ్చని పందిరిలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తారు.అలాగే దేవరకద్ర మండలంలోని లక్ష్మీపల్లిలోని రామాలయంలో కూడ శ్రీరామనవమి వేడుకలు జరుగనున్నాయి.

## జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆకస్మిక తనిఖీ చేసిన తెలంగాణ ఫుడ్ కమిషన్ సభ్యులు

**పెబ్బేరు,మార్చి 28 ప్రభాతవార్త:** మండల పరిధిలోని రంగాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ చేసి మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును తెలంగాణ ఫుడ్ కమీషన్ సభ్యులు కొంత గోవర్ధన్ రెడ్డి భోజనం రుచి, నాణ్యతను విద్యార్థులను స్వయంగా అడిగి తెలుసుకోవడం జరిగింది. భోజనం బాగుంటుందని విద్యార్థులు తెలిపారు. ఒక్కోసారి సివిల్ సప్లై ఎంఎల్‌ఎస్ పాయింట్ నుండి అందిస్తున్న బియ్యం నాణ్యంగా రావడం లేదని వంట నిర్వాహకులు కమీషనర్ కు తెలిపారు. వెంటనే సంబందిత జిల్లా సివిల్ సప్లై అధికారి కొండల్‌రావు తో మాట్లాడి ఇకపై అలాంటివి పునారావృతం కాకుండా చూడాలని ఆదేశించారు. తెలంగాణ ప్రభుత్వం ఎంతో ఖర్చు చేసి మధ్యాహ్న భోజనం విద్యార్థులకు అందిస్తున్నందున నిర్వహకులు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని ఆదేశించారు. విద్యాశాఖ అధికారులు కూడా శ్రద్ధ తీసుకోని మధ్యాహ్న భోజనం సరిగ్గా అమలయ్యేవిధంగా చూడాలని, లోపాలు ఉంటే సరిదిద్దాలని సూచించారు. సీఎం కేసీఆర్ మధ్యాహ్న భోజనం పథకం పై ప్రత్యేక శ్రద్ద చూపిస్తున్నారు కాబట్టి అధికారులు తరుచు తనీఖీ లు చేయాలని సూచించారు. మధ్యహ్న భోజన పథకం గురించి, ఆహార భద్రత చట్టం 2013 గురించి విద్యార్థులకు వివరించి ప్రతి విద్యార్థి స్కూల్‌లో తప్పకుండా భోజనం చేయాలని తెలిపారు. స్కూల్ లో మధ్యాహ్న భోజనం పథకం అమలుపై విద్యార్థులను విడివిడిగా అడిగి తెలుసుకోవడం జరిగింది. విద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటరామిరెడ్డి, భాస్కర్, ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజనం పట్ల పర్యవేక్షణ బాగుంది కంప్లెయింట్ బాక్స్ పెట్టాలని ప్రధానో పాధ్యాయుడికి ఆయన సూచించారు.



విద్యార్థులతో మధ్యాహ్న భోజన విషయాలను అడిగి తెలుసుకుంటున్న ఫుడ్ కమిషన్ సభ్యులు

## ఓటిఎస్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

**-పీఎసిఎస్ చైర్మెన్ డోకూర్ నరేందర్‌రెడ్డి -దేవరకద్రలో పిఏసిఎస్ మహాజనసభ**

**దేవరకద్ర,మార్చి 28 ప్రభాతవార్త:** దీర్ఘకాలిక రుణాలు తీసుకొన్న రైతులు వన్‌టైంసెటిల్‌మెంట్(ఓటిఎస్)ను సద్వినియోగం చేసుకోవాలని దేవరకద్ర పీఎసిఎస్ చైర్మెన్ డోకూర్ నరేందర్‌రెడ్డి సూచించారు. దేవరకద్రలో మంగళవారం స్థానిక రైతు వేధికలో దేవరకద్ర పిఏసిఎస (ప్రాథమిక సహ కార సంఘం) మహాజనసభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పీఎసి ఎస్ చైర్మెన్ డోకూర్ నరేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ నెల 31 వరకు ఓటిఎస్‌కు చివరి తేది అన్నారు. కావున రైతులు దీనిని సాద్యమైనంత వరకు సద్వినియోగం చేసు కోవడానికి ప్రయత్నించాలన్నారు. సహకార సంఘం బలోపేతానికి కృషిచేస్తున్నామన్నారు. దీనికి రైతులు సహకరించాలన్నారు. దాదాపు 78లక్షలతో దేవరకద్రలో పీఎసిఎస్ అధ్వర్యంలో గోదాము, షాపింగ్ కాంప్లెక్స్‌లను నిర్మిస్తున్నామన్నారు. ఈ పనులు పూర్తి కావస్తున్నాయన్నారు.ఇందులో రైతుల సౌకర్యార్థం 2 నాణ్య మైన క్రిమిసంహారక మందుల దుకాణాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అంతేగాకుండా ఏడాదిలోని 365 రోజులు రైతులకు సరఫరా చేయడానికి ఫిర్టలైజర్‌ను అందుబాటులో ఉంచడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. ఎప్రిల్ నెల నుండి బంగారుపై రుణాలు కూడ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబి మేనేజర్ వెంకటరమాణాచారి,సీఈఓ శ్రీనివాసులు,డైరెక్టర్లు నర్వ శ్రీనివాస్‌రెడ్డి,కృష్ణగోపాల్,ప్రతాప్‌రెడ్డి,వెంకట్రాములు,రాజు,మల్లేష్,తిరుపతిరెడ్డి,ఎక్బాల్‌పాష,సర్పంచులు హన్మంతు,రామాంజనేయులులతో పాటు ప్రజాప్రతినిధులు,రైతులు తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న పీఎసిఎస్ చైర్మెన్ డోకూర్ నరేందర్‌రెడ్డి

## ఘనంగా స్వయంపరిపాలన దినోత్సవం



పాఠశాలలో ఉపాధ్యాయులైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

**దేవరకద్ర,మార్చి 28 ప్రభాతవార్త:** దేవరకద్ర ఉమ్మడి మండలంలోని కౌకుంట్ల మండల కేంద్రంలోనున్న గుడ్స్ షెపర్డ్ ప్రవేటుపాఠశాలలో మంగళవారం విద్యార్థులు స్వయంపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయుల వేశాధారణలో పాఠాలు బోదించిన తీరు అందరిని ఆకట్టుకొంది. ఈ కార్యక్రమంలో దాదాపు 30 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రిగా జెశ్విి వ్యవహరించారు. అలాగే కలెక్టర్‌గా మదిహ,డీఈఓగా మీనాక్షీ , యంఈఓగా అను, తహశీల్దార్‌గా సమనాజ్‌బేగం,ప్రిన్స్‌పాల్‌గా మధు,పీఈటీగా శ్రేయాస్ వ్యవహరించారు.ఈ సందర్భంగా విద్యాబోదనలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జడ్పీటీసీ అన్నపూర్ణ శ్రీకాంత్,వైస్ యంపీపీ తుమ్మల సుజాతశేఖర్‌రెడ్డి,ప్రముఖ సామాజికవేత్త జహంగీర్,నాయకులు చందూగౌడ్,సాంభశివుడు,పాఠశాల ప్రిన్స్‌పాల్ రాజులతో పాటు ఉపాధ్యాయులు,గ్రామస్థులు, యవకులు పాల్గొన్నారు.

## దేవరకద్ర వ్యవసాయ మార్కెట్‌ధరలు

**దేవరకద్ర,మార్చి 28 ప్రభాతవార్త:** దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ యార్డుకు మంగళవారం 26 కింటాళ్ళ ఆముదాలను రైతులు విక్రయానికి తీసుకవచ్చారు.అయితే కింటాల్ ఆముదాలకు అత్యధికంగా రూ.6133 ధర పలికింది.అలాగే అతి తక్కువగా రూ.6129 ధర పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

## డోకూర్‌లో ఘనంగా ఫేర్‌వెల్ సమావేశం



ఉపాధ్యాయులకు సన్మానిస్తున్న విద్యార్థిని

**దేవరకద్ర,మార్చి 28 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం డోకూర్ తపోవన్ పాఠశాలలో సోమవారం రాత్రి పదవ తరగతి విద్యార్థుల ఫేర్‌వెల్ సమావే శాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్స్‌పాల్ వర్కుటి నిరంజన్‌రెడ్డి అధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు విద్యార్థులు ఘనంగా సన్మానించారు.అలాగే వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. ఆట,పాటలు నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్స్‌పాల్ వర్కుటి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మసలు కోవాలన్నారు. పరిక్షలను బాగా రాసి పాఠశాలకు,తల్లితండ్రులలకు పేరు ప్రతిష్టలు తీసుకరావాలన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## తాటికుంట గ్రామమే అపర భద్రాద్రిగా కొలుస్తున్న భక్తులు



సీతారామాంజనేయస్వామి దేవాలయం

**మల్దకల్,మార్చి 28 ప్రభాతవార్త:** గద్వాల జిల్లా మల్దకల్‌మండలం తాటికుంట గ్రామంలో ఈనెల 30న జరిగే శ్రీరామనవమి వేడు కలకు శ్రీ సీతా రామాంజనేయస్వామి దేవాలయం ముస్తాబయింది. తమ ఊరి ఆల యంలో తేరు లేదని గమనించిన గోపాల్‌గౌడ్ అనే భక్తులు ఎలాగైనా సరే తేరు చేయించాలనే ఉద్దేశంతో సీతారామాంజనేయ భక్తుడు రూ.6 లక్షలకు పైగా సొంత ఖర్చుతో ఉత్సవ విగ్రహాలకు రథోత్సవం నిర్వహిం చేందుకు కొత్తగా తేరును తయారు చేయించారు. గ్రామంలో దినదినాభి వృద్ధి చెందుతున్న సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో శ్రీరామ నవమి వేడుకలు గత ఎన్నో ఏళ్లుగాఅంగరంగ వైభవంగా జరుగు తున్నాయి. గ్రామానికి చెందిన మాజీ ఎంపిపి,రైతు సమితి అధ్యక్షుడు మదుసూద్‌రెడ్డి దంపతులు శ్రీరామ నవమివేడకలు అన్నదానం రథో త్సవ కార్యక్రమాలలో పాల్గొంటున్నారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ





**నారాయణపేట ప్రతినిధి,,మార్చి 28 ప్రభాతవార్త:** పట్టణంలోని శాతవాహన కాలనీలో శ్రీహంస వాహిని స్కూల్‌లో మంగళవారం విద్యార్థులే ఉపాధ్యాయులై స్వపరిపాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కలెక్టర్‌గా మమత, డీఈఓగా రామకృష్ణ, ఎంఈఓగా ఆకాష్, ప్రధానోపాధ్యాయులుగా భీమేష్‌లు వ్యవహరించారు. మరో 25 మంది చిన్నారులు ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించారు. ఒక్కరోజు ఉపాధ్యాయులుగా తరగతి గదిలో చక్కగా పాఠాలు బోధించి గురువులు, పోషకుల అభినందనలు అందుకున్నారు.అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో చక్కటి విద్యాబోధన చేసిన చిన్నారులకు బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో హెచ్‌ఎంరాజేష్‌కుమార్, యాజమాన్య సభ్యులు రామ్‌రెడ్డి, సంతోష్‌కుమార్, సుజాత, తిరుపతి, నరసింహులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పాఠశాలలను తనిఖీ చేసిన కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు



పాఠశాలను తనిఖీ చేస్తున్న కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు

**మక్తల్ రూరల్,మార్చి 28 ప్రభాతవార్త:** మక్తల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యా యులు అనిల్ గౌడ్ మండలంలోని ప్రాథమికోన్నత పాఠశాల చందాపూర్, ప్రాథమిక పాఠశాల తిరుమలాపూర్‌లను ఉదయం ప్రార్థనా వేళ సమ యంలో ఆకస్మికంగా సందర్శించారు. ఆయా పాఠశాలలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న తొలిమెట్టు (ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమ నిర్వహణ, దస్తావేజులను పరిశీలించారు. ఎఫ్ఎల్ఎన్‌లో నిర్వహించే మాసవారి పరీక్ష ఫలితాల ఆధారంగా విద్యార్థుల స్థాయిని, విద్యార్థిల వారిగా ఆగస్టు 2022 నుండి ఫిబ్రవరి 2023(ఏడు నెలల) నమోదును స్టూడెంట్ ట్రాక్టర్ యాప్‌లో రేపటిలోపు నమోదు చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు నిర్వహించిన ఆయా పరీక్షల జవాబు పత్రాలను భద్రపరచాలని, సమయపాలన పాటించాలని, మధ్యాహ్న భోజనం రుచి గా శుచిగా ఉండేటట్లు నిర్వహణచూసుకోవాలని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు సూచించారు.

## మైనార్టీ కార్పొరేషన్ రుణాలకు 54మంది హాజరు

**అమరచింత,మార్చి28 ప్రభాతవార్త:** మైనార్టీ కార్పోరేషన్ ద్వారా రుణాలు పొంది ఉపాధి అవకాశం కోసం దరఖాస్తు చేసుకున్న 94మంది మంగళవారం అమరచింత పురపాలక కార్యాలయం జరిగిన ఇంటర్వ్యూలకు 54 మంది హాజరయ్యారని మున్సిపల్ కమీషనర్ మహ్మద్ ఖాజ తెలిపారు. అర్హులైన లబ్దిదారులను గుర్తించి ఉపాధి పొందినందుకు పొందినందుకు బ్యాంకు రుణాలు అందిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వి.మంగమ్మ నాగభూషణం గౌడ్, బసవరాజు, పురపాలక జూనియర్ అసిస్టెంట్ బాలగోవింద్ లు పాల్గొన్నారు.

# జిల్లాలో ప్రతి కుంట, చెరువు సంరక్షణకు అధిక ప్రాధాన్యతనివ్వాలి

## -చెరువులు, కుంటలు చుట్టు మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలి: నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి28 ప్రభాతవార్త:** రానున్న 9వ విడత హరితహారంలో భాగంగా భారీ స్థాయిలో మొక్కలు నాటేందుకు నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న 1994 చెరువులు, కుంటల పరిధిలోని 1000 కిలో మీటర్ల పరిధిలో మొక్కలు పెంచడం, ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు సహా నీటి వనరులను పరిరక్షించేందుకు అధికారులు మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం సాయంత్రం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నీటి పారుదల డీఈలు, ఏఈలు మరియు ఆర్డీఓలు, తహసీల్దార్లతో రానున్న హరితహారంలో నీటి వనరుల సంరక్షణ, మొక్కలు నాటే కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లాలోని 20మండలాల వారీగా ఉన్న చెరువులు,కుంటల భూముల పరిరక్షణకు రెవెన్యూ మరియు నీటి పారుదల శాఖ



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్, హాజరైన అధికారులు

అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించి ఏప్రిల్ 10వ తేదీ నాటికి సమగ్ర వివరాలను అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రాజెక్టులు,నీటి కుంటలు, చెరువుల చుట్టు ఎఫ్‌టీఎల్ పరిధి భూముల చుట్టు మొక్కలను నాటి సంరక్షించాలన్నారు. అదే విధంగా రానున్న వర్షాకాలంలో చెరువులు, కుంటలు తెగకుండా ముందస్తుగానే ప్రతిష్ట చర్యలు చేపట్టాలన్నారు. గత సంవత్సరం భారీ వర్షాల వల్ల తెగిన కుంటల, చెరువులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని మళ్లీ అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ మరియు నీటి పారుదల శాఖ అధికారుల నేతృత్వంలో చెరువులు, కుంటల సంరక్షణకు సర్వే నిర్వహించి మొక్కలు నాటే పూర్తి బాధ్యత కూడా రెండు శాఖలపైనే ఉంటుందని కలెక్టర్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి చెరువుల కుంటల సంరక్షణకు అధిక ప్రాధాన్యతనిస్తూ ఆదేశించినట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు మనుచౌదరి, మోతీలాల్, ఈఈ మురళి, అధికారులు నర్సింగరావు, శ్రీనివాసులు, నాగలక్ష్మి, పాండునాయక్, హన్మనాయక్, రాజేష్‌కుమార్‌లతో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జడ్పీ చైర్మన్ పదవికి రాజీనామా చేసే వరకు..

# జడ్పీ సమావేశానికి హాజరుకాలేము

- మంత్రి లేకుండానే నీకు పదవి వచ్చిందా..!
- సొంత అజెండాను జిల్లా పరిషత్‌లో అమలు చేయొద్దు
- విలేకరుల సమావేశంలో వనపర్తి జిల్లా జడ్పీటీసీలు

**వనపర్తి ప్రతినిధి,మార్చి 28 ప్రభాతవార్త:** బీఆర్ఎస్ పార్టీ, మంత్రి నిరంజన్‌రెడ్డి ఇచ్చిన బీ-ఫామ్‌తో గెలిచి జడ్పీ చైర్మెన్‌గా ఎన్నికై బీఆర్ఎస్ పార్టీకి, మంత్రి నిరంజన్ రెడ్డికి వ్యతిరేకంగా మాట్లాడుతున్న వనపర్తి జడ్పీ చైర్మెన్ లోక్‌నాథ్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేస్తేనే జిల్లా పరిషత్ సమావేశాలకు హాజరవుతామని వనపర్తి జడ్పీ వైస్ చైర్మెన్ వామన్‌గౌడ్, జిల్లాలోని వివిధ మండలాల జడ్పీటీసీలు పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం మంత్రి నిరంజన్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ విధి విధానాలను గౌరవించకుండా పార్టీ వ్యతిరేక విధానాలకు పాల్పడడంతోనే తాము మంగళవారం నిర్వహించిన జడ్పీ సర్వసభ్య సమావేశానికి హాజరు కాలేదని ఇందులో ఎవరి బలవంతం లేదని వారు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం తీసుకున్ననిర్ణయాల మేరకే స్థానిక సంస్థలకు నిధులు కేటాయించేందుకు హెల్త్ సబ్ సెంటర్‌లకు జడ్పీ నిధులను, 15ఫైనాన్స్ నిధులను కేటాయించడం జరిగిందని ఇందులో ఒక వనపర్తి జిల్లాలోనే కాకుండా



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటీసీలు

రాష్ట్ర వ్యాప్తంగా ఆ నిధులను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కేటాయించడం జరిగిందని వారు గుర్తు చేశారు. మంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోబోమని మంత్రి అండదండలు, ఆశీస్సులు లేకుండానే నీకు పదవి వచ్చిందా అని వారు జడ్పీ చైర్మెన్‌ను ప్రశ్నించారు. తన సొంత అజెండాను జిల్లా పరిషత్‌లో అమలు చేస్తానంటే చూస్తూ ఊరుకోబోమని ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన జిల్లా పరిషత్ నిధులు, విధులను సక్రమంగా వినియోగించేందుకు జడ్పీటీసీ లు అందరు వారి అభిప్రాయం మేరకు నిధుల వినియోగం జరగాల్సి ఉంటుందని వారు హితవు పలికారు. విలేకరుల సమావేశంలో పెద్దమందడి జడ్పీటీసీ రఘుపతి రెడ్డి, రేవల్లి, పెబ్బేరు, పాన్‌గల్, గోపాల్‌పేట, జల్లాఘణపురం జడ్పీటీసీ లు పాల్గొన్నారు.

## మత సామరస్యాలకు ప్రభుత్వం పెద్దపీట

### -ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి



ఇఫ్తార్ కార్యక్రమంలో ఎమ్మెల్సీతో పాటు బీఆర్ఎస్ నాయకులు

**కల్వకుర్తి, మార్చి28, ప్రభాతవార్త:** మత సామరస్యానికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేసి అన్ని మతాలను సమాన దృష్టితో చూస్తుందని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని కల్వకుర్తి పట్టణంలోని మైనార్టీ రెసిడెన్షి పాఠశాలలో నిర్వహించిన ఇఫ్తార్ కార్యక్రమానికి ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు బ్యాంగి ఆనంద్ కుమార్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ అన్ని మతాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని, తెలంగాణ రాష్ట్రంలో అందరు సంతోషంగాఉండాలనే ఉద్దేశ్యంతోనే సీఎం కేసీఆర్ అన్ని మతాలకు ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. ఉపవాస దీక్షలతో అల్లా అనుగ్రహం పొందడం అదృష్టమన్నారు. ముస్లిం సోదరులకు ముందుగా రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులుఏజాస్,బావండ్ల మధు, షాన్‌వాజ్‌ఖాన్, హన్మనాయక్ ఉన్నారు.

## ఎంజెఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 28 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని జెడ్పీ మైదానంలో ఈ నెల 30న శ్రీరామనవమి నాడు ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి సందర్భంగా వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని తెలంగాణ రాష్ట్రంలో రక్త నిల్వల కొరత లేకుండా ఎంజెఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్త దాన శిబిరాన్ని ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ జక్కా రఘునందన్‌రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒక్క పిలుపుతో 2250 మంది యువతీ, యువకులు, అభిమానులు, పార్టీ కార్యకర్తలందరు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేసినందుకు ప్రతి ఒక్కరికి పేరు పేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రానున్న వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకొని తెలంగాణ రాష్ట్రంలో రక్త నిలువల కొరత లేకుండాతన జన్మదినం సందర్భంగా ఎంతో మంది ప్రాణాలను కాపాడేందుకు మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడమైందన్నారు. రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయడానికి సహకరించిన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, వనపర్తి, హైదరాబాద్ జిల్లాల బ్లడ్ బ్యాంక్ నిర్వాహకులందరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కల్పన భాస్కర్‌గౌడ్, వైస్ చైర్మన్ బాబురావు, మైనార్టీ నాయకులు నసీర్, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



**దేవరకద్ర,మార్చి 28 ప్రభాతవార్త:** ఎప్రిల్ 3 నుండి ప్రారంభమయ్యే పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాదించాలని పాలమూరు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు గోపాలకృష్ణ అన్నారు.దేవరకద్ర మండలంలోని ఆయా గ్రామాలలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలలో మంగళవారం పదవ తరగతి విద్యార్థులకు పాలమూరు లయన్స్‌క్లబ్ అధ్వర్యంలో ఉచితంగా పరిక్ష సామగ్రిని పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయా పాఠశాలలలో ఏర్పాటు చేసిన సమావేశాలకు పాలమూరు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు గోపాలకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.విద్యార్థులను ప్రోత్సహించాలన్న ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు.ఈ కార్యక్రమంలో పదవ తరగతి పరిక్షల్లో 10కి10జిపిఏ మార్కులు సాదించిన విద్యార్థులకు రూ.5వేల నగదు ప్రోత్సహకం అందజేస్తామని సమావేశాలలో లయన్ శ్రీహరి ప్రకటించారు.ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సీనియర్ ప్రతినిధి వీఆర్‌కే ప్రసాద్ కోశాధికారి రమకృష్ణ,పీఆర్‌టీయుటిఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు బుచ్చారెడ్డి,రెడ్‌క్రాస్ సమన్వయకర్త,పీఆర్‌టీయుటిఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అశ్విని చంద్రశేఖర్,సామాజిక సేవకులు అనంద్,రాజేందర్,ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చంద్రకళ, సల్వాచారి, నారాయణమ్మ, నాగేశ్వర్‌లతో పాటు ఉపాధ్యాయులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ పంటల సాగుతో అధిక లాభాలు



**ఇటిక్యాల, మార్చి 28 ప్రభాతార్త:** రైతులు ఆయిల్‌పామ్ పంటల సాగు చేసుకుంటే అధిక దిగుబడి లాభాలు పొందే అవకాశం ఉందని వ్యవసాయశాఖ ఎడిఎ సక్రియనాయక్ రైతులకు వివరించారు. మంగళవారం మండల పరిధిలోని గ్రామాలైన షాబాద్, శనగపల్లి, ఉదండాపూర్ గ్రామాలను సందర్శించి యాసంగి సీజన్‌లో సాగు అయిన పంటల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆన్‌లైన్‌లో పంటలనమోదు ప్రక్రియను పరిశీలించి పంటల వివరాలను పొందుపరిచారు. అదేవిధంగా షాబాద్ గ్రామంలో రైతు బాలకృష్ణారెడ్డి సాగుచేసిన ఆయిల్ పామ్ తోటను స్థానిక వ్యవసాయ విస్తరణ అధికారితో కలిసి క్షేత్రస్థాయి ప్రదర్శన చేసి ఆయిల్‌పామ్ తోటలు సాగు చేసుకోవడం వలన ప్రయోజనాలు, రైతులకు ఇతర పంటల కంటే అధిక లాభాలు వచ్చే అవకాశం ఉన్నందున రైతులు సంప్రదాయ పంటలను మానుకుని అధిక లాభాలు వచ్చే పంటల వైపు దృష్టి పెట్టాలని రైతులకు పలు సూచనలు ఇచ్చారు. ఈనెల మార్చి చివరి వరకు తమ దరఖాస్తులను అలంపూర్ డివిజన్ పరిధిలోని రైతు వేదిక క్లస్టర్ పరిధిలో పని చేస్తున్న వ్యవసాయ విస్తరణ అదికారులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చని అన్ని రకాల సబ్సిడిలు ప్రభుత్వం నుండి వచ్చే అవకాశం ఉన్నందున ముఖ్యంగా రైతులు త్వరగా దరఖాస్తు చేసుకుని ప్రభుత్వం సబ్సిడిలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ సురేందర్,రైతు బాలకృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి, రాంరెడ్డి, రంగన్న పాల్గొన్నారు.

# శాంతిభద్రతల పరిరక్షణపై డిజిపి నెలవారి సమీక్ష

**నారాయణపేట ప్రతినిధి,మార్చి 28 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర డిజిపి అంజనీ కుమార్ మంగళవారం మధ్యాహ్నం పోలీస్ కమిషన్లకు, జిల్లాల ఎస్పీలకు విడియో కాన్ఫరెన్స్ ద్వారా నెలవారి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డిజిపి మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకై పోలీస్‌శాఖ చేసే కృషి ఆయా ప్రాంతాల అభివృద్ధికి కారణమవుతుందని డిజిపి అన్నారు. రాష్ట్రంలో ప్రతి పోలీస్ స్టేషన్‌లోని అధికారులు సిబ్బంది ప్రత్యేక శ్రద్ధతో పని చేయడం వలన నేరాల పరిశోధన, నేర పరిశోధన, న్యాయ స్థానంలో శిక్షణ ఖరారుతో పాటు పోలీస్ కార్యాలయాలు ఆధునీకరణ పూర్తి చేయగలిగామన్నారు. వర్టికల్స్ వాటి పని తీరు, హెచ్‌ఆర్ఎంఎస్ వినియోగం, నేరాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు, పెండింగ్ కేసులు మొదలగు విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు.అలాగే రంజాన్ మాసం,శ్రీరామనవమి, హనుమాన్ జయంతి సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్పీ వెంకటేశ్వర్లు అధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్ కేసులు పూర్తిచేయడానికి నిత్యం కృషి చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో పోలీస్ అధికారులకు, సిబ్బందికి నిరంతరం ట్రైనింగ్స్, వర్క్‌షాప్స్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బందికి వీక్లీ పరేడ్ నిర్వహించారు. ప్రజలకు షీటీమ్స్, పోలీస్ కళాబృందం ద్వారా సైబర్ నేరాలు. పోలీస్ చట్టాలు, ట్రాఫిక్ రూల్స్, మూఢనమ్మకాలు, బాల్య వివాహాలు మొదలగు విషయాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. జిల్లాలో కమ్యూనల్ సెన్సిటివ్ ప్రాంతాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిఘా, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు.

**పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఎస్పీ:** విడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా పోలీస్ అధికారులతో ఎస్పీ వెంకటేశ్వర్లు ప్రత్యేక సమావేశం నిర్వహించారు.జిల్లాలో శాంతి భద్రత లకు విఘాతం



విడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎస్పీ, పోలీస్ సిబ్బంది

కలుగకుండా రంజాన్ మాసం, శ్రీరామనవమి, హను మాన్ జయంతి సందర్భంగా నారాయణపేట,ఉట్కూర్,మక్తల్,కోస్గిపోలీస్‌స్టేషన్ పరిధిలోని పోలీసులు అప్రమత్తంగా ఉండి ముందస్తు బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ తెలిపారు.జిల్లాలో అతిపెద్దజాతర భావోజీ జాతరకు కావాల్సిన బందోబస్తు వివరాలు తెలపాలని కోస్గి సిఐకి సూచించారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసే విధంగా చూడాలని తెలిపారు. జిల్లాలో నకిలీ విత్తనాల నిర్మూలనకు గంజాయి,గుట్కా, డ్రగ్స్ మొదలగు మత్తు పదార్థాల అమ్మకాలు కొనుగోలుచేసే వ్యక్తులపై నిఘా ఏర్పాటు చేయాలని తెలిపారు.దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను పిపి సలహా తీసుకుని కేసులను త్వరగా పూర్తి చేయాలని తెలి పారు. రాత్రి వేళలో గస్తీపెంచాలని,ఆకస్మికంగా వాహనాలతనిఖీలు నిర్వహించాలని సూచించారు. గ్రామాలలో, కాలనీలలో వ్యాపార సము దాయాలలో (షాప్స్) ఖచ్చితంగాసిసికెమెరాలు పెట్టుకునే విధంగా అవగా హన కల్పించాలని చెప్పారు.కార్యక్రమంలో సిఐలు రవిబాబు,సీతయ్య ,శ్రీకాంత్‌రెడ్డి, జనార్ధన్,రామ్‌లాల్,ఆర్ఐలుకృష్ణయ్య,దేవిడ్‌విజయ్,డిపిఓ సూపరింటెండెంట్ శంకర్‌లాల్, ఎస్సైలు సురేష్, నవీన్, సునిత, సుధమాధురి, డిపిఓ,డిసిఆర్‌బి, ఎస్‌బి, ఐటి కోర్ స్టాఫ్ మొదలగు వారు పాల్గొన్నారు.

## అమ్మవారి ఆశీస్సులతో వీరాయిపల్లి అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి

- యువత ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకొని ఉన్నత స్థాయిలో స్థిర పడాలి : ఎంపీపీ మేఘారెడ్డి

**పెద్దమందడి,మార్చి 28 ప్రభాతవార్త:** అమ్మవారి ఆశీసులతో వీరాయిపల్లి గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ది సాధించడంతో పాటు దేశానికి వెన్నముక అయిన యువత ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకొని ఆర్థికంగా, సామాజికంగా ఉన్నత స్థాయిలో స్థిర పడాలని పెద్దమందడి ఎంపీపీ మేఘారెడ్డి పిలుపునిచ్చారు. వీరాయిపల్లి గ్రామంలో గత 5 రోజుల నుండి కొనసాగుతున్న బొడ్రాయి ప్రతిష్ట మహోత్సవ కార్యక్ర మాలు అంగ రంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో పాల్గొ నాలని గ్రామస్థులు, యువకుల ఆహ్వానం మేరకు ఎంపీపీ మేఘారెడ్డి మంగళవారం గ్రామాన్ని సందర్శించి మొక్కులు తీర్చుకొని అమ్మవారి ని దర్శించుకున్నారు. శివాలయం,వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో తీర్థప్రసాదాలు అందుకున్నారు. గ్రామానికి వెళ్లిన ఎంపీపీ మేఘారెడ్డికి మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు ఐ.సత్యారెడ్డి, జల్లాఘణపురం మండల నాయకులు సాయిచంద్ రెడ్డి , గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. గ్రామంలో విఘ్నేశ్వరుని విగ్రహాన్ని గొల్ల సాయిలు, నందీ శ్వరుని విగ్రహాన్ని కావలి బాలకృష్ణ, సీతారామలక్ష్మణుల విగ్రహాలను దాదె వెంకటయ్య యాదవ్ వారి సహాయంతో ఏర్పాటు చేసినట్లు గ్రామస్థులు తెలిపారు. మంగళవారం ఉదయం నుండి బొడ్రాయి దగ్గ రకు పెద్దఎత్తున గ్రామ మహిళలు బోనాలతో వచ్చి గ్రామంలోని పలు వీధుల గుండా తిరుగుతూ బొడ్రాయి దగ్గర బోనాలు సమర్పించుకొని మొక్కులు తీర్చుకున్నారు.



వెంకటేశ్వరస్వామి ఆలయం దగ్గర కొబ్బరికాయ కొడుతున్న ఎంపీపీ మేఘారెడ్డి



గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన సీతారామలక్ష్మణుల విగ్రహాలు



గ్రామంలో ఎంపీపీకి ఘన స్వాగతం పలుకుతున్న గ్రామస్థులు



నూతన వినాయక విగ్రహం

## ముంపు బాధితుల పునరావాసం కొరకు చర్యలు వేగవంతం చేయాలి: జిల్లా కలెక్టర్

**నారాయణపేట ప్రతినిధి, మార్చి 28 ప్రభాతార్త :** సంగంబండ ముంపు బాధితులకు పునరావాసం కొరకు చర్యలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీహర్ష ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ వీడియా కాన్ఫరెన్స్ హాల్‌లో సంగంబండ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ముంపు గ్రామ పునరావాసంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వివరిస్తూ ముంపు గ్రామం పునరావాస కేంద్రానికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు రూ. 63 లక్షలు మంజూరైనందున పనులు ప్రారంభించాలని మండల అభివృద్ధి అధికారిని ఆదేశించారు. ఇప్పటి వరకు 714 కుటుంబాలకు ప్లాట్లు కేటాయించడం జరిగిందని మిగిలిన 47 కుటుంబాలకు సైతం పక్కనే ప్లాట్లు కేటాయించే విధంగా లే అవుట్ పూర్తిచేసి ఇవ్వాలని సర్వేయర్‌ను ఆదేశించారు. అందరికి ప్లాట్లు కేటాయించి పునరావాసానికి కావాల్సిన మౌలిక వసతుల పనులు ప్రారంభించినందున రిజర్వాయర్ కెనాల్ పనులకు గ్రామస్తులు ఆటంకం కలిగించవద్దని కోరారు. సమావేశంలో ఎస్‌డిసి రవిందర్‌రెడ్డి, మక్తల్ తహసిల్దార్ తిరుపతయ్య, ఎంపిడిఓ మక్తల్ వి. శ్రీధర్, సర్వేయర్ తదితరులు పాల్గొన్నారు.

## ఈత చెట్ల నరికివేతపై ఫిర్యాదు

**పెబ్బేరు,మార్చి 28 ప్రభాతవార్త:** మండల పరిధిలోని గమ్మడం గ్రామంలో నర్సరీలో ఉన్న కల్లుగీత కు సిద్దంగా ఉన్న 25ఈత చెట్లను కొంతమంది జేసీబీ తో తొలగించి వేశారని గౌడ కులస్తుల జీవనోపాధి పై దెబ్బ కొట్టారని గ్రామ వార్డు మెంబర్ రాఘవేందర్ గౌడ్ పంచాయితీ కార్యదర్శి బాలరాజు కు ఫిర్యాదు అందజేసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు.

## స్పింకర్ల పంపిణీ

**కొత్తకోట,మార్చి 28 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కానాయపల్లి, అమడబాకుల, కొత్తకోట, భూత్కూర్, రామకృష్ణాపురం గ్రామాల రైతులకు స్పింకర్లను మంగళవారం ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి సురేష్ మంగళవారం అందజేశారు, ఉద్యానశాఖ,పట్టుపరిశ్రమ ఆధ్వర్యంలో 113 స్పింకరుల రాగా,75% సబ్సిడితో ఆ గ్రామాలకు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ రవీందర్‌రెడ్డి, నరేందర్, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

## వాయిదా పడ్డ తైబజార్ వేలం

**కొత్తకోట,మార్చి 28 ప్రభాతవార్త:** కొత్తకోట తై బజార్ వేలం మంగళవారం నిర్వహించాల్సి ఉండగా కేవలం ఏడుగురు మాత్రమే తైబజార్ వేలం పాట పాడేందుకు టెండర్లు దాఖలు చేశారు. దీంతో అధికారులు అనుకున్న స్థాయిలో తైబజార్ వేలానికి రాకపోవడంతో తిరిగి ఈనెల 29, 30వ తేదీ వరకు దరఖాస్తులను తీసుకుంటామని మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసులు తెలిపారు. ఏప్రిల్ 1వ తేదీన వేలం పాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

**కొత్తకోట,మార్చి 28 ప్రభాతవార్త:** పట్టణంలోని 14, 15వ వార్డుల్లో మంగళవారం క్రైస్తవ సామాజిక పరిరక్షణ వేధిక ఆధ్వర్యంలో వృద్దులకు, వికలాంగులకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేసినట్లు ఆ సంఘవ వ్యవస్థాపకులు జనుంపల్లి సిమియోసన్ తెలిపారు. వేసవిలో ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని నిరుపేదలకు ఉపశమనం కోసం మజ్జిగ ప్యాకెట్లను అందిచినట్లు తెలిఆరు. ఈ కార్యక్రమంలో చంద్రబాబు, మోషే, చక్కరయ్య, తిమ్మోతి, తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం

**మిడ్జిల్, మార్చి28 ప్రభాతార్త:** మండలంలోని వేముల గ్రామంలో మరణించిన సొంటి అందర్ అమ్మరాసి మల్ల రాములు కుటుంబానికి కార్యకర్తల ద్వారా విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి రెండు కుటుంబాల్లో జరిగిన సంఘటనను చింతిస్తూ ఆ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.వారి అంత్యక్రియలకు ఆర్థికసాయంగా రాసిమల్ల రాములు కుటుంబ సభ్యులకు రూ. 5 వేలు, సొంటి అండలు కుటుంబానికి రూ. 5 వేల ఆర్థిక సహాయం టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు భీమిని పాండుయాదవ్‌కు అందజేయడం జరిగింది. కార్యక్రమంలో ఏఎంసి డైరెక్టర్ బకార వీరారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, దేవినిశ్యాము, సోషల్ మీడియా మండల ఇంఛార్జి మంద భీమరాజు,చిన్న ఆంజనేయులు, శేఖర్‌గౌడ్, రాసముల చెన్నయ్య, భరత్, బాలస్వామి పాల్గొన్నారు.

## శ్రీపబ్బతి ఆంజనేయస్వామి హుండీ లెక్కింపు

**పదర, మార్చి 28 ప్రభాతార్త :** పదర మండల పరిధిలోని మద్దిమడుగు శ్రీ పబ్బతి ఆంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం మూడు నెలలకు సంబధించిన హుండీని లెక్కించగా 19 లక్షల ఒక వెయ్యి 700లు 2 వేల 510 గ్రాముల మిశ్రమ వెండి వచ్చినట్లు శ్రీ పబ్బతి ఆంజనేయస్వామి దేవాలయ కమిటి ఛైర్మన్ శ్రీ పబ్బతి ఆంజనేయస్వామి దేవాలయ కమిటి ఛైర్మన్ డా.విష్ణుమూర్తి, ఆలయ కార్యనిర్వహణాధికారి రంగాచారి తెలిపారు. మూడు నెలలకు సంబంధించిన హుండీని లెక్కించగా దేవాలయానికి ఈ ఆదాయం సమకూరినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ,ధర్మాదాయ నాగర్‌కర్నూల్‌డివిజన్ ఇన్స్‌పెక్టర్ వెంకటేశ్వరి, జూనియర్ అసిస్టెంట్ జయపాల్‌రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు వీరయ్యశాస్త్రి, పాలకమండలి సభ్యులు, దేవాలయ సిబ్బంది, అర్చకులు, భక్తులు ఉన్నారు.

## చిరుధాన్యాలు వాటి ఉపయోగాలపై కిశోర బాలికలకు అవగాహన కల్పించిన సిడిపిఓ

**పదర, మార్చి 28 ప్రభాతార్త :** మండల పరిధిలోని ఉడిమిళ్ల ఆశ్రమ పాఠశాలలో మంగళవారం పోషణపక్షం కార్యక్రమంలో భాగంగా చిరుధాన్యాలు వాటి ఉపయోగాలపై కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఐసిడిఎస్ అచ్చంపేట ప్రాజెక్టు సిడిపిఓ దమయంతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సిడిపిఓ మాట్లాడుతూ కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోకపోవడంవల్ల రక్తహీనత ఏర్పడి వ్యాధులబారిన పడతారని వాటినినివారించడం కోసం చిరుధాన్యాలైన రాగులు,సజ్జలు,జొన్నలు,కొర్రలు,అర్కలు, బురకలు, సామలు తీసుకోవాలని వాటిని తీసుకున్నట్లయితే ఎంతో ఆరోగ్యంగా ఉంటారని ఆమె సూచించారు. దీంతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించి ఆకుకూరలు, కూరగాయలు, పాలు, పండ్లు, గుడ్లు తీసుకున్నట్లయితే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని వ్యాధులు దరిచేరవని సిడిపిఓ దమయంతి కిశోర బాలికలకు సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సువర్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రు, ఉపాధ్యాయులు,ఎఎన్ఎం, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## రైతు ఉద్యమాల వల్లే నల్ల చట్టాలు వెనక్కి..

- జన ద్రోహ ప్రభుత్వాన్ని ఓడించాలి:

### సీపీఎం జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు విజ్జు కృష్ణన్

**వనపర్తి టౌన్,మార్చి 28 ప్రభాతవార్త:** ప్రజా పోరాటాలను కాలదన్నిన శ్రీలంక ప్రధానికి పట్టిన గతి ప్రధాని మోదీకి పట్టడం ఖాయమని, కార్పోరేట్ వ్యవసాయం తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన కార్మిక చట్టాలను మోదీ మెడలు వంచి వెనక్కి నెట్టిన, జనద్రోహ బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ఐక్య ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందని సీపీఎం జాతీయ కార్యవర్గ సభునయలు విజ్జు కృష్ణన్ అన్నారు. సీపీఎం కేంద్ర కమిటీ పిలుపు మేరకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జన చైతన్య యాత్ర 3వ రోజు గద్వాల నుండి నాగర్‌కర్నూల్, కల్వకుర్తి పట్టణాల మీదుగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ మోదీ అధికారంలోకి దేశాన్ని అమ్ముతాడని అందుకే ఎర్రజెండా ద్వారా ఈ దేశంలో ప్రత్యామ్నాయ వ్యవస్థను తీసుకురావలసిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. కరోనా సమయంలో దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా వైద్యం అందించి లక్షలాది ప్రాణాలు కాపాడిన ఘన చరిత్ర కేరళ ప్రభుత్వానిది అని అన్నారు. ఆ సమయంలో 20రకాల నిత్యవసర సరుకులు పేద ప్రజలకు ఇంటింటికి తిరుగుతూ ఉచితంగా అందిచామని అన్నారు. అనేక వాగ్దానాలు ఇచ్చి ప్రజలను మరిపించి గద్దెనెక్కిన కేంద్ర ప్రభుత్వం నేడు మామీలు మరిచి మతత్వ రాజకీయాలకు తెరలేపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 9ఏళ్ల క్రితం గ్యాస్ ధర రూ.450 ఉంటే నేడు 1200 చేరిందని ఆయన మండిపడ్డారు. రూ.50 ఉన్న పెట్రోల్ ధర నేడువంద రూపాయలు దాటిందని అన్నారు.ఈ దేశంలో ఎక్కువగా ఆసక్తి చూపే ఆర్మీ ఉద్యోగంలోనూ కాంట్రాక్ట వ్యవస్థ తీసుకురావడం అత్యంత దుర్మార్గమని అన్నారు. స్వామి నాథన్ కమీషన్ నివేదికను బుట్టదాఖలు చేసి నల్ల చట్టాలు తెచ్చి నడ్డివిరుస్తున్నారని ఆయన విమర్శించారు. అనధికారంగా మరో 10లక్షల పైగానే ఆత్మహత్యలు జరిగి ఉంటాయని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కరోనా వల్ల లాక్‌డౌన్ అమలు చేస్తే భారతదేశ పారిశ్రామికవేత్తలకు మాత్రం లక్షల కోట్ల ఆదాయం ఎలా వచ్చిందని ప్రశ్నించారు. పారిశ్రామికవేత్తలకు లబ్ది చేకూర్చేందుకే నల్ల చట్టాలు తెచ్చి రైతులు నడ్డి విరిచే ప్రయత్నం చేశారని అన్నారు. అందుకే పంజాబ్ తో పాటు 500 రైతుఅనుబంధ సంఘాలచే దేశవ్యాప్త ఉద్యమాన్ని చేసి నల్ల చట్టాలను రద్దు చేసి మోదీ చేత క్షమాపణ చెప్పించిన ఘనత ఈ దేశ రైతులకే దక్కిందని అన్నారు. కిలో వెల్లిపాయలు రైతుల నుండి ఒకరూపాయికి కొనుగోలు చేసిన అధాని సంస్థలు తిఇగి అమ్మి లక్షలు సంపాదించుకుంటున్నారని అన్నారు. మోదీని దొంగ అన్నందుకే ఉలికిపడ్డ కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ లో ఉన్న అందరు దొంగలే కదా అని నిలదీశారు. పార్లమెవట్ సభ్యులు అజయ్ మిశ్రా కుమారుడు 6మంది రైతులను పొట్టన పెట్టుకున్నా మోదీ నోరు మెదపలేదని అన్నారు. కమ్యూనిస్టు రాష్ట్రమైన కేరళలో 20లక్షల మందికి పెన్షన్లు నాలుగు లక్షల మందికి పక్కా ఇల్లు నిర్మించి ఇచ్చామని అన్నారు. ఇక్కడ చేపడుతున్న జనచైతన్య యాత్ర ద్వారా బీజేపీ కృతజ్ఞత లేకుండా పోతాయని ఆయన పేర్కొన్నారు. జన చైతన్య యాత్రలో సీపీఎంరాష్ట్ర కార్యదర్శి టీసాగర్ రాష్ట్ర కమిటీ సభ్యులు రమణ, వెంకటరాయులు, వెంకటస్వామి, భూపాల్, అరుణ జ్యోతి, ధర్మా నాయక్, విజయ్, సోమన్న, ఆంజనేయులు, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.